
# నిద్రపోయే సమయాలు



9
డా॥ వి. చంద్రశేఖరరావు



1996

పూర్ణను నిద్రపోయేటప్పుడు చూడడం సుందరానికెంతో ఇష్టం. నిద్రపోయేటప్పుడు ఆమె ముఖం నిర్మలమైన సరస్సులా ఉంటుంది. ఉండి ఉండి ఆమె పెదాలపై సన్నటి నవ్వు విచ్చుకుంటుంది. భగవంతుణ్ణి కలగంటున్న దానిలా, మనోహరంగా ఉంటుందా నవ్వు. ఆమెనలా చూడటం కోసం, సుందరం నిద్రను మాని, చాలా రాత్రులు మేలుకొనే ఉండేవాడు. వాళ్ళ పెళ్ళయిన సంవత్సరం అది. పూర్ణ తొమ్మిది గంటలకే నిద్రపోయేది. ఆమె నిద్ర లేస్తుందనే ఆశతో సుందరం, అట్లాగే మేలుకొని ఉండేవాడు. రాను రాను ఆమెనట్లా, నిద్రపోతుండగా చూడటం సుందరానికి ప్రియమైన విషయం అయ్యింది. అలసిపోయి, ఆదమరచి, సమస్తాన్ని మరిచి పోయి, శిశువులా, కలలపై ఊరేగుతున్నట్లుగా ఉంటుంది ఆమె నిద్ర. అప్పట్లో ఒక శుక్రవారం రాత్రి ఇద్దరూ రాత్రి రెండుదాకా కబుర్లు చెప్పు కొని, స్ట్రాంగైన టీ తాగి నిద్రపోయారు. ఆ మరుసటిరోజు మధ్యాహ్నం రెండు గంటలకు అతను నిద్ర లేచాడు. ఆమె ఇంకా నిద్రపోతూనే ఉంది. లేచి, ముఖం కడుక్కొని కాఫీ, టిఫిన్ చేసి, భగవంతుని సాక్షా త్కారం కోసం ఎదురుచూసేవాడిలా, ఆమె మేలుకొనే క్షణాల కోసం ఎదురుచూస్తూ క్షణంసేపు తట్టుకోలేని మోహం వివశుణ్ణి చేసి, ఆమెను లేపి, దగ్గరకు జరుపుకొని, వేలయేళ్ళుగా ప్రపంచాన్ని మోస్తు న్నట్లుగా, ఆమె ముఖంలో అలసట కనబడి, ఆమె మేలుకొనే వరకు నిద్రలేపకూడదని నిర్ణయించుకొని, బయటకు, పారడైజ్ దాకా వెళ్ళి రెండు బిరియాని పొట్లాలు తెచ్చి, ఆమె భుజాలు పట్టుకొని పైకిలేపి, ఆమె కళ్ళు తెరిచి భగవంతుడిలా నవ్వి, అతని పెదాలపై ముద్దుపెట్టి, మళ్ళీ నిద్రలోకి ప్రయాణించేది. అతను, ఆమె పక్కనే కూర్చుని, ఆమె

రాత్రి నిద్రపోయే ముందు చదువుతూ వదిలేసిన నవలను, తీసుకొని శ్రద్ధగా స్కూలు విద్యార్థిలా పుస్తకం మొత్తాన్ని చదివేవాడు. ఆ నవల పూర్తయేసరికి సాయంత్రం ఐదు అయ్యేది. ఆమె నిద్ర లేవలేదు. సుందరానికి ఆకలిగా వుంది. తన పుస్తకాల్లోంచి 'అమృతం కురిసిన రాత్రి'ని బయటకు తీశాడు. పెద్దగా గొంతెత్తి కవిత్వాన్ని చదువు కున్నాడు. ఆరుగంటలకు నిద్రలేచింది పూర్ణ. కలువలు విచ్చుకొన్నట్లు గా కళ్ళు తెరిచింది. "ఆకలిగా ఉంది. తినడానికి పోయిట్రీయేనా, ఇంకేమయినా ఉందా?" అంది చిరునవ్వుతో. ఇద్దరూ బిరియానీ పొట్లాలను విప్పారు. ఆమె తినడాన్ని ఎంజాయ్ చేస్తుంది. కళ్ళ నిండా మెరుపు, చిన్నచిన్న ముద్దలను నాజూగ్గా ఎంతో ఇష్టంగా తింటుంది.

ఆదివారం సాయంకాలం, వాళ్ళు రోడ్డుపైన ఉండేవాళ్ళు. రోడ్ల అంచున పేవ్‌మెంటుపై, అట్లా నడుచుకుంటూ వెళ్ళేవాళ్ళు. అతని ప్యాంటు జేబులో పుస్తకం ఉండేది. పెరేడ్ గ్రౌండ్స్ చుట్టూ తిరిగి, ఒక మూలన, జనం ఎక్కువలేని చోట కూర్చునేవాళ్ళు. అతను పుస్తకం తీసి చదువుకునేవాడు. చదివేటప్పుడు, అతని పెదాలు కదులుతూ, తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా ఉంటుంది. సాయంకాలపు చలిగాలికి పైట నిండుగా కప్పుకొని, అతనివైపే ఇష్టంగా చూస్తూ, క్రమంగా నిద్రమత్తు ఆమెను కమ్మేస్తుంది. అతని భుజంపై వాలి పోయి, అతను పుస్తకం మూసేసి, ఆమె ఉనికిని, స్పర్శను ఎంజాయ్ చేస్తూ, అవన్నీ అద్భుతమైన రోజులు వాళ్ళ జీవితంలో.

అప్పట్లో వాళ్ళకిష్టమైన మరో అనుభవం, 'సి.వి.'తో మాట్లా డటం. వాళ్ళ యింటికి నాలుగైదు ఇళ్ళ అవతల ఇరుకైన గదిలో కాపురముండే సి.వి., నిరుద్యోగి. అనార్కిస్ట్, కవి. ఎక్స్‌ట్రా. మీసాలు అతికించిన సూర్యుడిలా, బాణాన్ని ఎక్కుపెట్టిన విల్లులా ఉంటాడు. అతనో అద్భుతమైన భావజాలంలా ఉంటాడు. సూర్యుడిలా అతని ముఖం తీక్షణంగా ఉండేది. అతను ఆటోగానీ, బస్సుకానీ ఎక్కడు, ఎక్కడికైనా నడిచే పోతాడు. రోడ్డుపైన వెళుతూ వెళుతూ, తన జేబు





లోని చివరి పదిరూపాయల నోటు, ఏ బిచ్చగాడికో యిచ్చేసి, తను ఆ రాత్రంతా పస్తు పడుకుంటాడు. అతను కవిత్వం రాస్తాడు. అప్పుడప్పుడు ఆ కవితలు పత్రికల్లో వచ్చేవి. ఆ కవితలు పత్రికలో వచ్చిన రోజు, ఇంటి చుట్టుపక్కల వాళ్ళను పిలిచి, ఆ కవిత్వాన్ని చదివి, దాని అర్థాన్ని వివరించేవాడు. అతని ఉత్సాహం సుందరానికెంతో నచ్చేది. 'ఏదీ సవ్యంగా సాగటంలేదని' గంటకోసారయినా గొణుక్కుంటాడు. సి.వి. నిద్రపోతున్న పూర్ణను చూస్తే నదులు, ఆకుపచ్చని అడవులు గుర్తుకొస్తున్నాయని అనేవాడు. సి.వి.తో గడిపిన ఎన్నో గంటలు, వాళ్ళకు ఇష్టమైన జ్ఞాపకాలు. ఆరు నెలల స్నేహం తరువాత సి.వి. హఠాత్తుగా అదృశ్యం అయ్యాడు. నలిగిపోయిన న్యూస్‌పేపర్ల మధ్యన చుట్టిన ఫొటోఫ్రేమ్ సుందరానికి ఇచ్చి, ఏమిటని అడిగే లోపలే హడావుడిగా వెళ్ళిపోయాడు. అది నిద్రపోతున్న పూర్ణ పెయింటింగ్. ఆకాశమంత మహాశూన్యంలో ఒక్కతే ఆదమరచి నిద్రపోతున్న దృశ్యం. వెళ్ళిపోతూ, వెళ్ళిపోతూ, తన గదిలోని పుస్తకాలు, చెక్క కుర్చీ, రాసుకునే మేజా బల్ల, అందమైన బూరుగుదూది పరుపు వాళ్ళకు కానుకగా ఇచ్చి వెళ్ళాడు. అతను అదృశ్యం అయి వెళ్ళిపోయిన తరువాత అప్పుడప్పుడు అతని దగ్గర నుంచి ఉత్తరాలు వచ్చేవి వాళ్ళకు. ఎరుపురంగు పక్షుల్లాంటివి అతని ఉత్తరాలు. పదో, ఇరవయ్యో పేజీల ఉత్తరాలు అవి. సి.వి. ఇచ్చిన రంగురంగుల పరుపును వాళ్ళో అపురూపమైన కానుకగా భావించారు. గది మధ్యలో పరిచి, దాన్నో 'ఏంటిక్' సంపదలా చూసుకోసాగారు. దానికి 'పోయిట్స్ కార్నర్' అని పేరు పెట్టుకున్నారు. అది వాళ్ళ స్వప్నసీమ. వాళ్ళ ఆత్మల అద్దం. వాళ్ళ శరీరాలపై వీచే సన్నజాజుల తుఫాను. ఆ పరుపు వాళ్ళ, పురాతన వాంఛలను గుర్తుకు తెచ్చే మోహపు తివాచీ, వాళ్ళ నిద్ర గృహం.

**2000**

మధురమైన క్షణాలు వాళ్ళ జీవితం నుంచి అదృశ్యం అవుతున్న కాలం యిది. సుందరానికి ఇష్టమైన చెగువేరా బొమ్మ ఉన్న

టీ షర్టు చిరుగులు బడి, బిచ్చగాడికి కానుకగా ఇచ్చారు. పరుపు కింద దాచిన సి.వి. ఉత్తరాలు కనబడకుండా పోతున్నాయి.

వాళ్ళ కుటుంబంలోకి పాపాయి వచ్చింది. పుట్టడమే 'సిక్'గా పుట్టింది. ఊపిరి చాలనట్లుగా, ఆయాసంగా ఉండేది. దానికి గాలాడటం కోసం, నిత్యం ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి ఉంచేవాళ్ళు. పిసరంత గాలి కోసం, ఆ బుడ్డిపిల్ల గుండెలవిసేలా ఏడ్చేది. వాళ్ళిద్దరికి కూడా అంతటా గాలి వీచటం ఆగిపోయి, చుట్టూ ఇనుప గోడలు మొలిచినట్లుగా ఉండేది. ఏప్రిల్ నెలలో పాపాయిని ఇంటి నుంచి, హాస్పటల్‌లో ఐ.సి.యు.కి మార్చారు. పూర్ణ కళ్ళలో వెలుగు మాయమైంది. పాపాయి పక్కనే, నిర్లిప్తమైన చూపులతో, నిద్ర కూడా పోయేదికాదు. కాస్త కునుకు పట్టినా నిముషంలో ఉలిక్కిపడి లేచేది.

మే నెల ఎనిమిదిన, సాయంకాలం అన్ని వైపుల నుంచి యముని మహిషపు అగ్నిశ్వాసల్లా సెగగాలులు వీస్తున్న వేళ, హాస్పటల్ నుంచి, వాళ్ళిద్దరే ఇంటికి తిరిగి వచ్చారు. పాపాయి మరింక ఆ యింటిలో కనబడదు. ఆరోజు పూర్ణ చాలారోజుల తరువాత నిద్ర పోయింది. దాదాపు ఇరవై ఆరుగంటల పాటు నిద్రపోయింది. అయితే ఆ నిద్రలో సుందరం ముచ్చటపడే సౌందర్యం లేదు. మనోహరం లేదు. ప్రాణంలేని మనిషిలా పరుపుపై నిస్తేజంగా పడి ఉంది. సుందరం చాలాసార్లు ఆమె ముక్కు దగ్గర చెయ్యి పెట్టి, శ్వాస ఉందా, లేదా అని చూసేవాడు.

**2002**

ఆ ఉదయం ముందుగా సుందరం మేలుకొన్నాడు. పూర్ణ ఆపాటికే లేచి తూర్పుకు ముఖాన్ని పెట్టి కూర్చుంది. కలలు ఇబ్బంది పెట్టినప్పుడు ఆమె అట్లా విప్పారిన కళ్ళతో, విస్మయాందోళనలతో బ్రాన్పడిపోతుంది. "ఏం కల కన్నావు," అన్నాడు సుందరం.

"కలలో చచ్చిపోయిన శిశువును కన్నట్టుగా, బిడ్డ చచ్చిపోలేదు, నిద్రపోతున్నాడు, అంటున్నావు నువ్వు," అంది గాఢంగా నిట్టూరుస్తూ.





ఆదివారం ఆరోజు. సుందరానికి ఆకలిగా ఉంది. పూర్ణ లేచి టిఫిన్ చేసే కార్యక్రమం ఏమీ చెయ్యలేదు. మంచి కల కోసం మరో రెండు గంటలపాటు నిద్రపోవాలని నిర్ణయించుకుంది. ఆకలికి తట్టు కోలేక, తనే వంటగదిలోకి వెళ్ళి, రెండు కోడిగుడ్లతో ఆమ్లెట్ చేసుకొని తిన్నాడు.

ఆ మధ్యాహ్నం, వాళ్ళిద్దరూ సిటీలో తిరగడానికి నిర్ణయించు కొన్నారు. పూర్ణ లుంబినీ పార్కులో బోట్ రైడ్ చేస్తుండగా, సుందరం కోఠీ వైపు వెళ్ళి, ఫ్రాయిడ్ రాసిన 'ఇంట్రప్టేషన్స్ ఆఫ్ డ్రీమ్స్' పుస్తకం కొనుక్కొచ్చాడు. వచ్చేటప్పుడు ఇద్దరూ ఇరానీ రెస్టారెంట్‌కి వెళ్ళారు. ఇప్పుడే వస్తానంటూ వెళ్ళి, పక్కనే ఉన్న బార్‌లో రెండు పెగ్గుల విస్కీ తాగి వచ్చాడు. ఆ సాయంత్రం సుందరం, విస్కీ యిచ్చిన కిక్‌తో పూర్ణకు ఉచితంగా సమకాలీన రాజకీయ విశ్లేషణ అందించాడు. జేబు లో చాన్నాళ్ళుగా దాచిపెట్టిన సి.వి. ఉత్తరాన్ని తీసి పెద్దగా చదివాడు. హఠాత్తుగా దుఃఖం పొంగుకొచ్చి, రెండు చేతుల్ని ముఖంపై కప్పుకొని పెద్దగా ఏడ్చాడు. పూర్ణలో ఏ స్పందనా లేదు. సినిమాలో సన్నివేశాన్ని చూస్తున్నట్లుగా చూసింది.

ఆ రాత్రి సుందరం ఫ్రాయిడ్ కలల విశ్లేషణ పుస్తకాన్ని దీక్షగా అధ్యయనం చెయ్యటం మొదలుపెట్టాడు. పూర్ణకు గత నెలరోజు లుగా వస్తున్న కలల్ని నోట్ చేసుకొని, వాటిని విశ్లేషణ చేస్తున్నాడు. పూర్ణ అద్దం ముందు కూర్చుని, జుట్టుకు రకరకాల నూనెలు పూసి, నాలుగైదు రకాలుగా దువ్వుకొంది. ఆరేళ్ళ క్రితం, తన జుట్టు ఎంత పొడవుగా, ఒత్తుగా ఉండేదో గుర్తుకొచ్చి దిగులుపడింది. ఆ రాత్రి పూర్ణ తన జుట్టుకు హెన్నా పెట్టుకొంది. కురులను ఆరబెట్టుకుంటూ నిద్ర గదిలోకి వచ్చింది, సుందరం అప్పటివరకు చదువుతున్న ఫ్రాయిడ్ పుస్తకాన్ని పరుపు కింద దాచి, కొత్తగా జుట్టుకు రంగువేసి, రెపరెపలాడుతున్న జుట్టుతో, కలల్లోని అమ్మాయిలా ఉన్న పూర్ణను చూస్తూ "ఎంత అందంగా ఉన్నావో తెలుసా," అన్నాడు తమకంతో.

"ఊ," అంది పూర్ణ. సుందరం పక్కనే పడుకొని ఫాన్ గాలికి, ఎగిసి పడుతున్న జుట్టు సుందరం ముఖంపై డాన్స్ చేస్తుండగా, పూర్ణ తన కొత్త కల గురించి చెప్పింది.

"నేను మళ్ళీ తార్నాక వెళ్ళాను. నా చేతిలో కెమెరా. మనం తిరిగిన ప్రదేశాలు, మన పాత యిల్లు, సి.వి. ఉండే గది. గుర్తున్న ప్రతీదాన్ని ఫొటో తీస్తున్నాను. యూనివర్సిటీ హాస్టల్ దగ్గ సి.వి. కన బడ్డాడు. ఒక బెంచీపై నిద్రపోతున్నాడు. దగ్గరకు వెళ్ళి నిద్రలేప బోయాను. 'లేపొద్దు-లేపొద్దు ఆయన గాఢమైన నిద్రను కలగంటు న్నాడు' అన్నారు ఎవరో. రోడ్డుపైన ఒక పెద్ద ఊరేగింపు. 'మా నిద్రను మాకివ్వండి' అని అరుస్తున్నారు. 'మేక్ లవ్, స్లీప్ వెల్' అని నినాదాలు చేస్తున్నారు. 'మనం మళ్ళీ పెళ్ళి చేసుకుందామని' ఎస్.ఎమ్.ఎస్ ద్వారా నువ్వు నాకు ప్రపోజ్ చేస్తున్నావు. అంతలో సి.వి. నిద్రలేచి, శాలువా కింద దాచుకొన్న రెక్కల్ని విప్పి ఎగురుకుంటూ వెళ్ళి పోయాడు."

ఆ రాత్రి వాళ్ళిద్దరూ కలల గురించి చాలాసేపు మాట్లాడు కున్నారు. ఉత్సాహంగా, ఇష్టంగా పూర్ణను దగ్గరకు తీసుకున్నాడు సుందరం. సుందరం నిద్రపోయాక కూడా చాలాసేపు మేలుకొని ఉంది పూర్ణ. ఇప్పుడు పూర్ణకు పడుకొన్న వెంటనే నిద్రపట్టడం లేదు. రెండు మూడు గంటలు అట్లాగే కళ్ళు తెరుచుకొని, సీలింగ్ ఫాన్ వైపో, దూరంగా మిణుక్కుమనే దీపం వైపో చూస్తూ ఉంటుంది. చాలాసార్లు నిట్టూరుస్తుంది. కారణం లేకుండానే కళ్ళలో నీళ్ళు తిరుగు తాయి. సుందరంపై కోపం వస్తుంది. హాస్పటల్ గది, మరణించిన శిశువు, కిక్కిరిసిన రోడ్లు, నిర్లిప్తంగా నడుస్తున్న జనం, బంద్‌లు, లాఠీచార్జీలు, మార్చురీ బయట పడుకోబెట్టిన శవాలు, ఏవేవో దృశ్యాలు కళ్ళ ముందు కనబడి, భీతిల్లుతుంది పూర్ణ. సుందరాన్ని గట్టిగా కరుచుకొని, రాని నిద్రకోసం పెనుగులాడుతుంది.

ఆ మరుసటి రోజు సాయంత్రం పూర్ణ, ఆఫీసు నుంచి వస్తూ, గుప్పెడు చాక్లెట్లు, మల్లెపూల దండ కొనుక్కొని, హ్యాండ్‌బ్యాగ్‌లో





దాచుకుంది. యుద్ధ భూముల నుంచి వస్తున్నట్లుగా జనం, వాళ్ళను తోసుకుంటూ బస్‌స్టాప్‌కు చేరింది. బస్‌స్టాప్‌లో నిలబడి ఉండగా, మోటరు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు కుర్రాళ్ళు, ఆమె పక్కగా వెళుతూ, ఆమె హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని క్షణాల్లో అదృశ్యం అయ్యారు. జనం పూర్ణ చుట్టూ మూగి, సానుభూతి చెప్పి, పోలీస్ కంప్లైంట్ ఇమ్మని సలహా యిచ్చారు. ఉపయోగం ఉండదని పూర్ణకు తెలుసు. చాలా సేపు అక్కడే నిలబడి ఉంది పూర్ణ. బస్ టిక్కెట్‌కు కూడా డబ్బులు లేవు. పేవ్‌మెంటుపై నడుచుకుంటూ ఇంటికి బయలుదేరింది. ''జీవితం ఇట్లా ఉంటే మంచి కలలు, మంచి నిద్ర ఎట్లా వస్తాయి'' అనుకుంది.

**2004**

సుందరం ఆ సాయంత్రం ఐదు, ఆరు గంటల మధ్య ఐదు వందలకు పైగా ఎస్ఎమ్ఎస్‌లు అందుకున్నాడు. అన్ని మెసేజ్‌ల లోనూ అతన్ని 'ట్రైటర్' అని 'బ్రోకర్' అని 'థర్డ్ రేట్ పింప్' అని వివ రించడానికి వీలుకాని భాషలో అతన్ని తిడుతూ, ''డబ్బు కోసం ఇంత దిగజారాలా... పోనీ,'' అంటూ పూర్ణ గురించి అసహ్యకరమైన తిట్లు ఉన్న మెసేజ్ చూసినాక, అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. దుఃఖ ముద్రలో ఉన్న గౌతముడిగా చాలాసేపు గడిపి, ఇంటిలో మిగిలిన చివరి వంద రూపాయలకు పరోట, బీరుబాటిల్ పార్సిల్ చేయించు కొన్నాడు. బీర్ బాటిల్ మొత్తం తాగి, బెడ్‌రూమ్‌కి వెళ్ళి పరుపును ప్రేమగా నిమిరి, రెండు మస్కిటో కాయిల్స్ వెలిగించుకొని, ఏడు గంటలకే నిద్రపోయాడు. నిద్రలో అతనో ఆడమనిషిని కలగన్నాడు. (ఆ మనిషి పూర్ణ కాదు). ఆడమనిషి నగ్నంగా పడుకొని ఉంది. శరీరం నిండా వందరూపాయల నోట్లు కప్పుకొంది. సుందరం ఆమె పైకి వంగి, ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకోవాలని చూశాడు. ఆమె పెదవులు, ఇనుములా తుప్పువాసన వేస్తుండగా, తుఫ్, తుఫ్‌మని ఊసుకుంటూ నిద్రలేచాడు. చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కున్నాక,

అతనికి చాలా విషయాలు అర్థం అయినాయి. తను జైలులో వున్న, పదిహేను రోజుల్లో, చాలాసార్లు ఇంటిపై దాడులు జరిగాయి. భయ పడిన పూర్ణ నెలల పాపాయితో, పుట్టింటికి వెళ్ళింది. ఇల్లంతా ధ్వంసం చెయ్య బడింది. ఎవరికి తోచింది వాళ్ళు పట్టుకుపోయారు. వందల సి.డి.లు, కంప్యూటర్, ఇంటి ముందున్న మోటర్ సైకిలు, బట్టలు, బీరువా, ఏదీ మిగల్చలేదు.

పరుపుపై నిస్తేజంగా కూర్చున్నాడు. గోడలపైనున్న ఫోటోలు, ఆఖరికి పెళ్ళి ఫొటో కూడా అదృశ్యం అయ్యింది. గుండెలలో సన్నగా సలిపే నొప్పి, భరింపరానిదై, సుడులు తిరిగి, పెద్దగా ఏడ్చాడు.

ఆగస్టు నెల 2004 సంవత్సరమది. వర్షాలు ఆగిపోయి మళ్ళీ ఎండలు మొదలయినాయి. ఎండ వేడి, తట్టుకోలేని ఉక్క, ఎక్కడా పిసరంత గాలిలేదు. సంవత్సరం క్రితం సుందరం ఉద్యోగం పోగొట్టు కున్నాడు. ఎలిమెంటరీ స్కూలు టీచర్ అతను. ఏడెనిమిదేళ్ళ పిల్లలు, పిల్లల మధ్య కూర్చుని పాఠాలు చెప్పటం అతనికిష్టం. ఒకడు జుట్టు లో చేతులు పెట్టి ఆడుకునేవాడు. ఇంకొకడు, అతని వీపుపై దరువు వేస్తూ, ఒకడు అతని జేబులోని పెన్ లాగి, అతని కళ్లజోడును తగి లించుకొని, కాసేపు ఆడుకొని కబుర్లు చెప్పుకొని, కొంచం కొంచం పాఠం చెప్పుకొని, హెడ్‌మాస్టరుకు ఇది ఇష్టం ఉండేది కాదు. పిల్లల్ని దండించి, భయపెట్టి చదువు చెప్పాలనేది అతని థీరీ. 'తాట వలి చెయ్యండి వెధవల్ని' అనేవాడు. అదే శీర్షికతో సుందరం ఒక దినపత్రికలో వ్యాసం రాశాడు. హెడ్‌మాస్టరు, ఇన్ స్పెక్టర్ (స్కూళ్ళ) మొత్తం సిస్టంని తప్పుపట్టాడు. ఆ వ్యాసం కారణంగా సుందరానికి మెమో ఇచ్చారు. ఇంకోసారి హెడ్‌మాస్టరు ఒక పిల్లవాణ్ణి ఎండలో ఒంటికాలితో నిలబెట్టి, 'ఐ యా మే డాంకీ' అంటూ వల్లె వేయిస్తు న్నాడు. తట్టుకోలేని కోపంతో సుందరం, హెడ్‌మాస్టరు చెంప పగల గొట్టాడు. ఆ తర్వాత సస్పెన్షనూ, ఎంక్వైరీ, రిమూవలూ, కోర్టు కేసు. కోర్టు కేసు ఇంకా కొనసాగుతూంది.





సుందరం ఉద్యోగం పోయి ఆరు నెలలు దాటింది. ఉద్యోగం పోయిన కొత్తలో పత్రికలకు వ్యాసాలు రాసి బతకవచ్చు అనుకున్నాడు. అది సాధ్యంకాదని తేలింది. పార్ట్‌టైం జాబులు సంపాదించటం చాలా ఈజీ అనుకున్నాడు. అవీ కుదరలేదు. చివరకు పూర్ణ బోటిక్ షాపులో సేల్స్‌లేడీగా చేరాల్సి వచ్చింది.

వర్షం కురుస్తున్న ఒక రాత్రి, పూర్ణ అతని గుండెలపై తల పెట్టుకొని నిద్రపోతుండగా, సన్నటి వానజల్లు. ఉరుములు, మెరుపులు; మెలుకువ వచ్చి పూర్ణ బయటకు వెళ్ళి, తలుపులన్నీ తెరిచి, చల్లని గాలితో కలిసిన సన్నటి తుప్పరలో తడుస్తూ, పాటనే ఏదో హమ్ చేస్తూ, ఆ వాన మనోహరమైన కలలా పూర్ణను చుట్టు ముట్టి, ఆమెనో ట్రాన్స్‌లోకి తీసుకెళ్ళింది. వరండా బయట, సన్నటి తడిగాలుల మత్తుకు అలాగే నిద్రపోయింది.

అర్ధరాత్రి ఎప్పుడో నిద్రలేచి, సుందరం పరుపును తడుము కున్నాడు. పరుపు పూర్ణలా వాసన వేస్తుందిగానీ, పూర్ణ పరుపుపై లేదు. సుందరానికి భయంవేసింది. ఉద్యోగం లేదని, బతకలేమని, సుందరాన్ని వదిలేసి వెళ్ళిపోయిందేమోనని, భయంతో అరిచాడు సుందరం. ‘‘పూర్ణా, పూర్ణా ఎందుకిట్లా చేసేవు?’’ అంటూ పెద్దగా ఏడ్చాడు. చాలాసేపు అట్లా ఏడ్చినాక, పూర్ణ ప్రత్యక్షమైంది. ‘‘పీడకలా, భయపడ్డారా?’’ అంది ‘‘అట్లా భయపడితే ఎట్లా?’’ అని ముందుకు వంగి, అతని తలను మృదువుగా నిమిరి, ఆ ఓదార్పు సుందరంలోనికి ఇంకలేదు. భయం సుందరాన్ని పూర్తిగా ఆవహించింది. ఆ భయం లోంచి కొత్త సుందరం అవతరించాడు.

పదిహేను రోజులపాటు హిప్నాటిజంలో కోర్సు తీసుకున్నాడు. కొద్దిగా తంత్రశాస్త్రం నేర్చుకున్నాడు. క్రమంగా, అతను దీర్ఘంగా ఆలో చించటం, తాత్వికునిలా మాట్లాడటం, (గుబురుగడ్డం కూడా పెంచాడు) సంకేతాత్మకమైన కలల్ని కనడం మొదలుపెట్టాడు.

న్యూస్‌పేపర్లో ‘మీ జీవితాన్ని మార్చే, పది సూత్రాల కోసం, ఈ సెల్ నెంబరుకు ఫోన్ చెయ్యండి’ అంటూ ప్రకటన ఇచ్చాడు.

‘గాఢమైన నిద్రపోవడం ఎలా?’, ‘విజయపథాన్ని మీ బానిసగా చేసుకోవటమెలా?’ ‘ఆరు నెలల్లో లక్షాధికారులు కావడం ఎలా’, ‘కోరుకొన్న స్త్రీని పొందటమెలా?’, ‘సెక్స్ జీవితం చేదు విషంలా ఉందా? అమృతాన్ని సాధించుకోవటమెలా?’ అంటూ వరుసగా ప్రకటనలు ఇచ్చాడు. వేలసంఖ్యలో ఎస్ఎమ్ఎస్‌లు అతనికి వచ్చాయి. అందరినీ వందరూపాయలు పంపమనేవాడు. ఇరవై పేజీల పుస్తకాన్ని (అతను రాసినదే) వాళ్ళకు పోస్ట్‌లో పంపేవాడు. ఆ పుస్తకాల్లో సైకాలజీ, తంత్రం, తాత్వికత, కాస్త పొయిట్రీ ఉండేవి. ఆశ్చర్యంగా, అవి చదివిన వాళ్ళు తమలో మార్పు వచ్చిందని చెప్పేవాళ్ళు. సంవత్సరం తిరిగేసరికి సుందరం ఆదాయం లక్షలు దాటింది. ఆ ఉత్సాహంతో ఆర్ట్ ఆఫ్ విన్నింగ్ (ఎప్పుడూ విజయాన్ని సాధించటమెలా?) అంటూ ట్రైనింగ్ క్లాసులు మొదలుపెట్టాడు. యోగా, మెమరీ టెక్నిక్స్, ప్రేమించడం, ప్రేమించబడటం, సుందరం చేతులు చాలా విశాలం అయ్యాయి. ఊహించనంత డబ్బు, పూర్ణను ఉద్యోగం మాన్పించాడు. పూర్ణ మళ్ళీ మాతృగీతం అయ్యింది. నెలలు నిండి, మనోహరమైన కలలా వుంది. అమెను, ఆ నిద్రను చూసి ఆనందించే సమయం లేదు సుందరానికి.

మెమరీ పిల్స్ వికటించి, ఒక టెన్త్‌క్లాస్ కుర్రాడు హాస్పటల్‌లో చేరాడు. ‘ప్రేమించబడటం’లో కోర్సు చేసిన ఒక కాలేజీ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. ఏ డిగ్రీ లేకుండా క్వాక్‌లా సైకాలజీ క్లినిక్ నడుపుతున్నాడని పోలీసులు కేసు పెట్టారు. ఆర్ట్ ఆఫ్ విన్నింగ్ మూత బడింది. సుందరాన్ని జైల్లో పెట్టారు. కోర్సులకు అడ్వాన్స్ ఇచ్చిన వాళ్ళు అతని ఇంటిపై దాడి చేశారు.

ఆ రాత్రి, నిర్జనమైన ఆ యింటి వరండాలో వెలుతురు పిసరంతైనా లేని గదిలో, గది పైకప్పు పై నుండి వందలాది చేతులు, అతని వైపు వేళ్ళు చూపుతూ, ‘ట్రైటర్’, ‘ట్రైటర్’ అని కోరస్‌లా అరుస్తూ, బయట వెన్నెల పాలిపోయి, రాత్రి దిగులు దిగులుగాచి గడిచిపోయిన సంవత్సరాలన్నీ... అతని ముందు మోకరిల్లి ‘ఇలా’ ‘ఇందుకా?’ అని





ప్రశ్నిస్తున్నట్లుగా, తొలిరోజుల నాటి పూర్ణ గుర్తుకొచ్చి, మృదువుగా అతని జుట్టు నిమురుతూ 'ఏవీ ఆ మధురమైన రోజులు' అని అడుగు తున్నట్లనిపించి దుఃఖంలాంటి, వివరించలేని బాధ లాంటి అనుభవం అతన్ని చుట్టుముట్టి ఆ రాత్రంతా అతను విలవిలలాడిపోయాడు. ఎప్పుడో వేకువజామున ఒక నిద్ర మేఘం అతన్ని దయగా చుట్టు ముట్టింది. అయితే, అది ఎలాంటి నిద్ర? దయామేఘ మల్హారంపై, మోహలోకాల్లో సంచరించే నిద్ర కాదు. భీకరమైన వేసవి ఎండల్లో ఎర్రని బండరాళ్ళపై దొర్లటం లాంటి నిద్ర అది.

**2005**

పూర్ణ, నిద్రపోయేటప్పుడు, పెద్దగా రొద చేసుకుంటూ వెళ్ళే సిటీ బస్సు గుర్తుకువస్తుంది. అందంగా మడతలు బెట్టిన చీరల గుట్టలు గుర్తుకొస్తాయి. విశాలమైన పరుపుపైన ఒక మూలన ముడుచుకొని, తలను రెక్కల మధ్య పూడ్చి పెట్టుకొన్న నీటిబాతులా ఉంటుంది. కలలన్నీ ఖాళీ చెయ్యబడ్డ ఒట్టి నిర్జీవమైన నిద్ర అది.

సుందరం, ఇప్పుడు పెద్దగా నిద్రపోడు. ఎప్పుడన్నా కాస్త కునుకుపడితే నిద్రలో ఆకాశపు ఉరితాడుకు వేలాడే చందమామ, దారం తెగి, గాలిలో గిరికీలు కొట్టే ఆకుపచ్చని గాలిపటం, కొమ్మలు, ఆకులు లేని చెట్లు, కాళ్ళకు చేతులకు సంకెళ్ళతో వీధుల్లో నడిచే మనుషులు, కలల రూపంలో సుందరానికి తారసపడతారు.

'జీవితం చాలా అందమైంది, వెళ్ళు ప్రపంచం అంతా బయటే ఉంది, కాలు బయటకు పెట్టు' అని తనకు తాను ఆజ్ఞ ఇచ్చు కుంటాడు. ఇంటా, బయట, రోడ్డుపై మనుషులు కత్తులు, కర్రలతో పరుగెడుతున్నట్లు, ఒక కల. మరో కల సుదీర్ఘమైంది. అందులో అతని భవిష్యత్తు అంతా వివరంగా కనిపిస్తుంది. కలలో అతనో రియల్ ఎస్టేట్ సేల్స్‌మెన్. అద్భుతమైన వాగ్ధాటితో, ఎన్నో ఇళ్ళు అమ్మి లక్షలు సంపాదిస్తాడు. పనిలో పనిగా అతను వాస్తు పుస్తకాలు కూడా రాస్తాడు. వాస్తుపై లెక్చరిస్తాడు. కల చివరిలో అతను బికారిగా, చిరిగిన చొక్కా

అరిగిపోయిన చెప్పులతో కనిపిస్తాడు. కల ముగింపు కొచ్చేసరికి, ఒక మారుమూల అపార్టుమెంట్‌లో అతను చంపబడి ఉంటాడు. అతని శరీరం అట్లాగే ఆ అపార్టుమెంటులో నెలరోజుల పాటు, ఎవరూ ఆ అపార్టుమెంటు తలుపులు తెరవక, అతని శరీరం కుళ్ళి, ఆ భీకరమైన కంపుకు భయంతో వెర్రికేక వేస్తూ నిద్ర లేస్తాడు.

నిజానికి 2005లో సుందరం చరిత్ర, ఆ కల దగ్గరే మొదలైంది. రియల్ ఎస్టేట్ ఏజెంటు, వాస్తు పుస్తకాలు, పత్రికల్లో వాస్తు గురించిన వ్యాసాలు, అతని అనివార్య మరణాన్ని నివారించే ఏ పని అయినా చేయడానికి సిద్ధమయ్యాడు. ప్రస్తుతం సుందరం సికింద్రాబాద్ రేతిఫీల్డ్ బజారులో ఒక మూలనున్న ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. ఆ ప్రెస్‌లో సెక్స్ పత్రికలు రహస్యంగా ప్రింట్ చేస్తుంటారు. అందులోని కథలన్నీ సుందరమే రాస్తున్నాడు (అద్భుతమైన కవితా శైలితో).

సుందరానికి ఇప్పుడు కలలంటే భయం. తను రాసిన కథలన్నీ అతని కలల్లోకి వస్తాయి. ఆ కలలన్నిటిలో పూర్ణ, రకరకాల భంగిమల్లో రకరకాల మనుషులతో, సుందరం రాత్రిపూట నిద్రమాత్ర వేసుకొని పడుకుంటాడు, గాఢమైన కలలు రాని నిద్రకోసం. అతని ప్రస్తుత జీవితమంతా, ఒక కలలోని దృశ్యమే. ఎప్పుడో చాలారోజుల క్రితం అతను కలగన్న దృశ్యమే.

మూడు నెలల తరువాత, ప్రెస్ యజమాని 'రొమాంటిక్ టాక్' అంటూ టెలిఫోన్‌లో శృంగార సంభాషణ వ్యాపారం మొదలుపెట్టాడు. ఇప్పుడు సుందరం గొంతు వందలాది సెక్స్ మానియక్‌లకు చేరుతుంది. అతిహేయమైన, జుగుప్సాకరమైన సంభాషణలను, రోజంతా మాట్లాడి అతని నాలుకకు గాయమైనట్లు, నిప్పులు నోట్లో పోసుకున్నట్లు అతని నోరు నిత్యం భగభగమంటుంది. ఫోన్ పక్కన కూల్ డ్రింక్ పెట్టుకొని పదేపదే చప్పరిస్తూ-

రాత్రులు అతని పరిస్థితి దుర్భరంగా ఉంటుంది. ప్రెస్ నించి వస్తూ, బార్‌లో కాస్త మందు పుచ్చుకొని (విస్కీతో తడిపితేనే ఆ నాలుక





మంట తగ్గేది) పూర్ణ విసుక్కునేది, రోజూ ఈ తాగుడేంది అని. 'తాగక పోతే చచ్చిపోతాను' అనేవాడు. నిద్రకు ముందు పూర్ణకు అతనితో చాలాసేపు మాట్లాడాలని ఉంటుంది. అతను నోరు విప్పేవాడు కాదు. అతని భాష చచ్చిపోయింది. పదాలన్నీ మరిచిపొయ్యాడు, సెక్స్ గురించిన ఆ కాసిన్ని మాటలు, నోరు తెరిస్తే, ఆ మాటలు ఎక్కడ అంటానో అని భయంతో వణికిపోయేవాడు. పూర్ణ నిద్రపోయాక సుందరం లేచి కిటికీలను, తలుపులనూ తీసి, తలుపు ఎదురుగా మోకాళ్ళపై తలను వాల్చుకొని, వెన్నెలతో తడిచిన చల్లని గాలులు అతని లోపలికి ప్రవేశించాలని లోపలున్న తగలబడే అడవుల్ని చల్లార్చాలని; ఏ అర్ధరాత్రో నిద్ర వచ్చి అక్కడే కూలబడి నిద్రపోయేవాడు.

ఆ రోజుల్లో సుందరం సి.వి. గురించిన వార్తలు పత్రికల్లో చదివాడు. అతన్ని అరెస్టు చేశారని, విశాఖపట్నం జైల్లో ఉంచారని. వైజాగ్ వెళ్ళాలని సి.వి.ని కలవాలని ఆశపడ్డాడు. ధైర్యం చాల్లేదు. ఆ తరువాత జైలు డైరీ పేరుతో సి.వి. రాసిన కవితలు పేపర్లో వచ్చాయి. హైకూల్లాంటి కవితలు. ఆత్మకథ చెప్పుకున్నట్లుగా పర్సనల్ గా ఉన్నాయా కవితలు. బాల్యం, తల్లిదండ్రులు, స్నేహితులు, చిన్ననాటి ముచ్చట్లు, ఆ కవితల్లో సుందరం, పూర్ణల గురించిన సందర్భాలు వచ్చినప్పుడు భయంతో వణికిపోయేవాడు సుందరం. ఆ రోజు ప్రెస్‌కు సెలవుపెట్టి, ఆ పేపరును చేతిలో పటు కొని, ఊరంతా తిరిగేవాడు. ఆ నాలుగైదు వాక్యాలు దూర ప్రాంతాల నుంచి వచ్చిన అజ్ఞాత మరణాల కబుర్లలా అతన్ని వివశుణ్ణి చేసేవి. అతనికి, ఒకానొక రూపం కళ్ళముందు నిలిచేది. జైలు గోడల మధ్య పౌరాణిక మూర్తిలా ధగధగా మెరుస్తూ సి.వి. రూపం, తన చుట్టూ కోట్లాది బూతు పదాలు, రోడ్డు మధ్య నడుస్తూ... నడుస్తూ... ఒకచోట ఆగిపోయి పేపరును ముఖంపై కప్పుకొని పెద్దగా ఏడుస్తాడు సుందరం.

**2006**

సి.వి. మరణాన్ని గురించి ఆరోజు ఉదయం పేపర్లో చదివాడు సుందరం. అతను చనిపోవడమేమిటి అని చాలాసేపు మథనపడ్డాడు.

ఇప్పుడో కాసేపటికి ముందో అతనితో మాట్లాడినట్లుగా ఉంది. పేపర్లో సి.వి. గురించిన కథనాన్ని చదివాక సుందరానికి 'ఎందుకు...?' అనే ప్రశ్న ఎదురైంది. సముద్రాన్ని చీల్చుకొని అట్లా నడవటం ఎందుకు, జైళ్ళలోకి, ఊపిరాడనితనంలోకి అట్లా నిర్భయంగా వెళ్ళడం ఎందుకు, కత్తి మొనలపై నడుచుకుంటూ సాహసాలు ఎందుకు? ఎందుకు అనే ప్రశ్నతో పాటు సుందరానికి తన జీవితం గుర్తుకొచ్చింది. ముగ్ధ గాథల్లాంటి నిన్నటి నిద్ర సమయాలు గుర్తుకొచ్చాయి. లోపల జ్వరాన్ని పొదిగినట్లుండే ఇవాల్టి నిద్రలు గుర్తుకొచ్చాయి. చాలాసేపటి వరకు ప్రశ్నల చెట్టుకు వేళ్ళాడు తూనే ఉన్నాడు సుందరం.

ఇల్లు అనే యంత్రం మేలుకొంది. పూర్ణ వంటగదిలో ఉంది. టి.వి.లోంచి నిరంతర వార్తలు వినిపిస్తున్నాయి. కూరగాయలు అమ్మే వాళ్ళ కేకలు, ఆటోల శబ్దాలు, మేలుకొన్న నగర రాక్షసి పెద్దగా ఆవులిస్తున్న చప్పుళ్ళు.

సుందరానికి ఎందుకో, ఇల్లంతా సర్దుకోవాలనిపించింది. పూర్ణ ఇంటి బయట ఊడుస్తుండగా, సుందరం ఇల్లంతా సర్దాడు. అటక పైన పుస్తకాలన్నీ కిందికి దించి బూజు దులిపాడు. ఇద్దరూ కలిసి వంట చేసుకున్నారు. టిఫిన్ చేస్తూ సి.వి. గురించి చాలాసేపు మాట్లాడుకున్నారు. షాపుకు సెలవు చెప్పింది పూర్ణ. హడావిడిగా బట్టలు వేసుకుని బయటకు నడిచాడు సుందరం. ప్రెస్, నిప్పులు చిమ్మే ఫోన్ సంభాషణ, బ్యాంక్ లోను, నిద్రరాని జబ్బు, రాయాల్సిన ఉత్తరం, నెలలుగా తగ్గని బి.పి., నల్లనైన ఇవాల్టి ఆకాశం, పాముల పుట్టల్లాంటి అపార్టుమెంట్లు, గాలి రెక్కలపై వేలాడుతున్న ఉదయపు చలి, వీటన్నిటి మధ్య 'ఎందుకు' అనే ప్రశ్న వేధిస్తుంది సుందరాన్ని. ఎల్.బి. నగర్ ప్రయాణించాడు. సి.వి. ఉన్న ఇంటి దగ్గరకు. ఆ వీధిలో అడుగు పెట్టగానే ఒక జ్వర తీవ్రత, చెమట పట్టినవాడిలా.

సి.వి. ఉన్న ఇల్లు ఇప్పుడు లేదు. అక్కడో అపార్టుమెంటు లేచింది. దానికి ఎదురుగా ఉన్న టీస్టాల్ దగ్గర కూర్చున్నాడు





సుందరం. టీ స్టాల్ ఓనర్ని పలకరించాడు. పొగలు కక్కే టీ గ్లాస్‌ను అందుకొని, బిస్కెట్లు నంచుకుంటూ, లోపల పదిమంది దాకా వున్నారు. వాళ్ళు ఏవేవో విషయాలు మాట్లాడుకుంటున్నారు. మధ్యాహ్నం దాకా అక్కడే ఉన్నాడు సుందరం. చాలాసార్లు టీ తాగాడు. అక్కడకు వచ్చి వెళుతున్న జనాన్ని చూస్తున్నాడు. వాళ్ల కబుర్లని శ్రద్ధగా విన్నాడు. జీవితం గురించే, సమస్యలు, బాధలు, అంతటా నిట్టూర్పులు, దిగుళ్ళు అతని జీవితానికి నకలుగా ఉన్నట్లు గా అనిపించింది. చాలాసేపు అక్కడ కూర్చున్నాక, అతని లోపలి 'కొట్టుకులాట' కాస్త తగ్గినట్లు అనిపించింది. మధ్యాహ్నం రెండుకు ఇంటికి చేరాడు.

పూర్ణ ఇల్లంతా సర్దింది. కొత్త కర్టన్లు వేసింది. సి.వి. ప్రజెంట్ చేసిన 'నిద్ర' పెయింటింగ్‌ను శుభ్రంగా తుడిచి గోడకు అలంకరించింది. పరుపుకు కొత్త కవరు వేసి, రంగు దుప్పట్లు పరిచి ఇల్లంతా కొత్తగా, మళ్ళీ పుట్టినట్లుగా ఉంది. ఇద్దరూ కలిసి అన్నం తిన్నారు. సి.వి. గురించిన కబుర్లు చెప్పుకుంటూ అట్లాగే నిద్రపోయారు. చాలా రోజుల తరువాత వాళ్ళకు గాఢమైన నిద్ర పట్టింది.

నిద్రలో పూర్ణ, పదేళ్ళనాటి పూర్ణమాణిక్యాన్ని కలగంది. అప్పటి పూర్ణ మాణిక్యం తిరిగివచ్చి ఇల్లాంతా కల తిరుగుతున్నట్లు, ఇల్లు పూర్ణ మాణిక్యం వాసన వేస్తున్నట్లు సుందరానికి కూడా అలాంటి కలే వచ్చింది. కవిత్వం రాస్తున్న రోజుల నాటి సుందరం కలలోకి వచ్చాడు. కలలోని సుందరం కవిత నొకదాన్ని చదువుతున్నాడు. మెలుకువ వచ్చినాక కూడా ఆ కవిత సుందరాన్ని వెంటాడుతూనే ఉంది.

*పాలపిట్ట మాసపత్రిక, సెప్టెంబర్ 2010*